సాక్షి
తిరుపతి

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



సకల సదుపాయాల కల్పనే లక్ష్యం

పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా స్కీమ్ ద్వారా ఎంపికైన స్కూళ్లలో సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. - 8లో



ఫ్యాషన్ లైఫ్

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు ఇప్పుడు తిరుపతి నగరంలో అందుబాటులోకి రావడంతో యువతకు ఉపాధి దొరుకుతోంది. - 8లో



ఉత్తమ టీచర్లకు సన్మానం

జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలైన టీచర్లను తిరుపతి కలెక్టర్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. - 8లో

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న డిగ్రీ మూడో విడత రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో మూడవ విడత డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. ఈ మేరకు అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ఉన్నత విద్యామండలి సమాచారం అందించింది. గత రెండు విడతల్లో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉండడంతో మూడోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియను కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించి, 15న వెబ్ ఆప్షన్ల మార్పు చేసుకునేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. 18వ తేదీన సీట్లు కేటాయింపు ప్రక్రియను చేపట్టి 21వ తేదీలోపు సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని అధికారులు సూచించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,030 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,476 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించారని తెలియజేస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు మహిళా వర్సిటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ఈ నెల చివరి వారంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ ఎస్వీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరిగిన జిల్లాస్థాయి సీనియర్ గ్రూప్ (18–28 ఏళ్లలోపు) వారికి జరిగిన పోటీల్లో సీఎస్ఈ విభాగం విద్యార్థిని ఎం.వి జయదుర్గ గోల్డ్‌మెడల్ సాధించగా, ఈసీఈ సెకండియర్ విద్యార్థిని వర్షిత మూడవ స్థానంలో నిలిచింది. నాలుగో స్థానంలో కావ్య, ఐదో స్థానాన్ని అలేఖ్య దక్కించుకున్నారు. మరో సీనియర్ గ్రూప్ (28–35 ఏళ్లలోపు) విభాగంలో జరిగిన పోటీల్లో ఎల్ఎల్‌బీ విద్యార్థిని రేవతి గోల్డ్ మెడల్ సాధించగా, లావణ్య సిల్వర్ మెడల్ సాధించింది. మూడోస్థానాన్ని ఎంపీ గౌతమి సాధించింది. మరో సీనియర్ గ్రూప్ (35–45 ఏళ్లలోపు) విభాగంలో జరిగిన పోటీలలో యోగాలో పీజీ డిప్లొమో చేస్తున్న విద్యార్థిని డాక్టర్ డి.స్రవంతి మూడోస్థానంలో, ఎల్ఎల్‌బీ విద్యార్థిని ధనలక్ష్మి 4వ స్థానంలో నిలిచారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం పట్ల వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, వ్యాయామ విభాగాధిపతి సారా సరోజిని అభినందించారు.

సృష్టికి మూలం అమ్మ.. సృష్టించలేనిది అమ్మ గుణం.. అవును..లోకం చూపే కన్నులకు కంటిపాప అమ్మ.. మరి అమ్మపాలు.. అమృతాని కన్నా తియ్యనే కదా.. పసిబిడ్డకు అమ్మ ప్రేమే సంజీవని.. ఉగ్గును పట్టి ఊయలలూపే మాధుర్యం అమ్మఒడి.. ఊపిరి పోసే నిండు నూరేళ్ల దీవెన.. మరి ఈ పుడమిపై పుట్టగానే ఎంతమంది పసికందులకు అమ్మపాలు అందుతున్నాయి. అలా అమ్మ పాలు లేని పసివాళ్లకు తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటైన మదర్ మిల్క్ బ్యాంక్ ఆపద్బాంధవిలా మారింది. ఆరోగ్యవంతమైన తల్లుల నుంచి పాలు సేకరించి భద్రపరిచి శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన పసిపాపలకు తల్లిపాలు అందిస్తున్నారు.



పాలను దానం చేస్తున్న బాలింత

మురిపాల కోవెల

- ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మదర్ మిల్క్ బ్యాంక్
- నవజాత శిశువుల ఆకలి తీర్చుతున్న అమ్మపాల కేంద్రం
- ఇప్పటికే 100 లీటర్లు సేకరించి వేల మంది చిన్నారుల గొంతు తడిపిన సిబ్బంది
- రోజుకు సుమారు 30 నుంచి 50 మంది పసికందులకు ప్రాణం పోస్తున్న వైనం
- పాలను దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న మాతృమూర్తులు
- ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి నెలకు 25 లీటర్ల పాల సేకరణ
- శిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యం

పాలను దానం చేసిన బాలింతలకు ఇచ్చే డ్రైఫ్రూట్స్



బాటిళ్లలో భద్రపరచిన తల్లిపాలు

తిరుపతి తుడా: అమ్మపాలు అమృతం కంటే శ్రేష్ఠమైనవి.. అమ్మ పాలతో పెరిగే పిల్లలో రోగనిరోధక శక్తితో పాటు చక్కటి మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది. నవజాత శిశువుల ఆరోగ్యానికి తల్లి పాలు దృఢమైన పునాది వేస్తాయి. అయినప్పటికీ పలు కారణాలతో తల్లి పాలకు దూరమయ్యే పసికందులు లక్షల్లో ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి ముగ్గురు నవజాతి శిశువుల్లో ఇద్దరికి తల్లిపాలు సమృద్ధిగా అందడం లేదని తేలింది. అమ్మ పాల కొరతతో కన్నుమూసే పసికందులను రక్షించేందుకు గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక నగరం తిరుపతి రుయా ఆస్పత్రిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీక్లబ్ సహకారంతో ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన హ్యూమన్ మిల్క్ బ్యాంక్ (తల్లి పాల కేంద్రం)ను ప్రారంభించారు. ప్రస్తుతం పురిటి బిడ్డలకు అమ్మఒడిగా నిలిచి ప్రశంసలు పొందుతోంది.

ఎలాంటి శిశువులకు అందిస్తారంటే..!

పుట్టిన వెంటనే తల్లి చనిపోయిన శిశువులకు, 2 కేజీల కంటే బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు, తల్లి ఆరోగ్యంగా ఉండి చనుపాల ద్వారం (నిప్పిల్స్) మూసుకుపోయి పాలు రాని పరిస్థితి ఏర్పడిన శిశువులకు, తల్లిపాలు పడని శిశువులకు, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్న బాలింతల పిల్లలకు పాలు అందిస్తున్నారు. అలాగే కాన్పు తేదీ కంటే ముందుగా పుట్టిన శిశువులకు, పోషక విలువలు తక్కువగా ఉన్న పిల్లలకు పాల కేంద్రం ద్వారా ఒక్కో ఫీడింగ్‌కు 30ఎం.ఎల్. చొప్పున రోజుకు 12 సార్లు ఫీడింగ్ ఇస్తారు. ఇలా సుమారు ఒకటి నుంచి 6 నెలల వరకు అందిస్తారు.

తల్లుల నుంచి పాల సేకరణ ఇలా...

స్వచ్ఛందంగా తల్లి పాల కేంద్రానికి వచ్చే దాతల నుంచి తల్లి వయసు, డెలివరీ వివరాలు, ఆధార్ కార్డు వంటి ఆధారాలతో అన్ని వివరాలను దరఖాస్తు రూపంలో నమోదు చేసుకుని, అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారు. అందులో సంపూర్ణ ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి మాత్రమే పాల సేకరణ చేస్తున్నారు. ఒంటిపై టాటూస్, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నా కూడా తీసుకోరు. అలాగే బాలింతలు తమ బిడ్డకు సరిపడి మిగులుగా ఉన్న పాలను మాత్రమే డొనేట్ చేయాల్సి ఉంటుంది.

నవజాత శిశువులకు వరం

తల్లిపాలు అవసరం ఉన్న నవజాత శిశువులకు అవసరమైన పాలను మదర్ మిల్క్ బ్యాంకు అందిస్తుంది. అమ్మపాలు శిశువు ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో కీలకం, తల్లి పాల ప్రాధాన్యత తెలియకపోవడంతో కొందరు తల్లులు పిల్లలకు పాలిస్తే తమ శరీర ఆకృతి పాడైపోతుందని ఆవు, గేదె పాలను, మిల్క్ పౌడర్‌ను బాటిళ్లలో పోసి పట్టిస్తుంటారు. మరికొందరు బాలింతల విషయంలో శిశువుకు తగినంత పాలు లేకపోవడం, తల్లి అనారోగ్యంగా ఉండటం, గర్భిణి సమయంలో తల్లులు తగిన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో పాల వృద్ధి క్షీణిస్తుంది. ఇటువంటి వారికోసం మదర్ మిల్క్ కేంద్రం ఓ వరంలా మారింది.

ఇప్పటి వరకు 100 లీటర్ల సేకరణ

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని తల్లిపాల కేంద్రంలో ఇప్పటివరకు సుమారు 100లీటర్ల పాలను సేకరించి సుమారు 1000మంది శిశువులకు అందించారు. ప్రతి నెల సుమారు 23 నుంచి 25 లీటర్ల పాలను దాతల నుంచి సేకరిస్తున్నారు. మిగులు పాలు ఉన్న తల్లులకు ప్రత్యేక బృందంతో కౌన్సెలింగ్ ఇస్తూ పాల సేకరణపై అవగాహన కల్పిస్తున్నారు. పాలు డొనేట్ చేసిన తల్లులకు సుమారు 6 రకాల డ్రైఫ్రూట్స్ అందించి ప్రోత్సహిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రసవించిన వారే కాకుండా ఆరోగ్యవంతులై బయటి నుంచి వచ్చే దాతల తల్లుల నుంచి సైతం పాలను సేకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. మదర్ మిల్క్ కావలసిన వారు, ఇవ్వాలనుకునే దాతలు 8919469744 నంబర్‌లో సంప్రదించవచ్చు.



సేకరించిన పాలను అందిస్తున్న మహిళ

సేకరించిన పాల నిల్వ ఇలా..



సేకరించిన పాలను రిఫ్రిజిరేటర్‌లో భద్రపరుస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి సుమారు 200 ఎం.ఎల్.కు పైబడి ఒక సిట్టింగ్‌లో పాలను సేకరిస్తారు. ఇందులో 10 ఎం.ఎల్. శాంపిల్ పాలను పరీక్షల నిమిత్తం మైక్రోబయోలజీ విభాగానికి పంపుతారు. సేకరించిన పాలను మిక్స్ చేసి రెఫ్రిజిరేటర్‌లో ఉంచుతారు. అనంతరం యూవీ రేస్‌లో ఉంచి సుమారు 3 గంటల పాటు పాశ్చరైజేషన్(పాలలోని హానికరమైన సూక్ష్మజీవులు లేకుండా చేసే ప్రక్రియ) మిషన్‌లో ఉంచి శుద్ధి చేసి బాటిళ్లలో నింపి 62.4 టెంపరేచర్‌లో వేడి చేస్తారు. ఆ పాలను సుమారు 30 నిమిషాల పాటు కూలింగ్ ప్రాసెసర్‌లో ఉంచుతారు. శాంపిల్స్ పరీక్ష రిపోర్టులు వచ్చిన వెంటనే డీప్‌ఫ్రిడ్జ్‌లో ఉంచుతారు. ఆరు నెలల పాటు పాలు సురక్షితంగా ఉండేలా మిల్క్ బ్యాంకు అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



పాలలోని పోషకాలను పరీక్షించే ప్రక్రియలో స్టాఫ్‌నర్సులు

దేవుడిచ్చిన అవకాశం..

నేను ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు అయ్యాను. మా బిడ్డకు సరిపడి, ఇంకా పాలు మిగులుతున్నాయి. దీంతో మిల్క్ బ్యాంక్ డాక్టర్లు, నర్సులు సంప్రదించారు. మిగిలిన పాలను డొనేట్ చేసి మరో శిశువు ఆకలి తీర్చుతున్నాననే ఆనందం కలుగుతోంది. ఎంతోమంది తల్లిలేని పిల్లలు, పాలు పడని బాలింతల శిశువులకు అండగా ఉండడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నా. – బాలింత, తణపల్లి, తిరుపతి

శిశు మరణాల రేటు తగ్గించేందుకే..



దేశవ్యాప్తంగా ఎంతోమంది పురిటి బిడ్డలు తల్లిపాలకు దూరమై పోషకాల లేమితో చనిపోవడం బాధాకరం. రోటరీ క్లబ్ తరఫున శిశు మరణాలను తగ్గించాలనే దృఢ సంకల్పంతోనే హ్యూమన్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేయాలనుకున్నాం. ఈ విషయాన్ని అప్పట్లో ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పెద్దఎత్తున స్పందన వచ్చింది. సుమారు రూ.35 లక్షల వ్యయంతో మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేశాం. చాలా మంచి స్పందన వస్తోంది.

– టి.దామోదరం, హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్ట్ చైర్మన్, తిరుపతి

పురిటి బిడ్డలకు ఆసరాగా..



నవజాత శిశువుల సంరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నాం. ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు అయిన చాలామంది తల్లులకు పలు కారణాలతో పాల ఉత్పత్తి తక్కువ కావడం, ఆకస్మిక మరణాలతో శిశువులు అనాథలవడం, తక్కువ బరువుతో జన్మించిన పురిటి బిడ్డలకు ఆరోగ్యవంతులైన బాలింతల నుంచి మిగులు పాలను సేకరించి పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ చందన, మెడికల్ ఆఫీసర్, రుయా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

30 నుంచి 50 మందికి అందిస్తున్నాం



మిల్క్ బ్యాంక్ నవజాతి శిశువులకు వరం. ఎంతోమంది తల్లులు పాలు లేక డబ్బా పాలతో ఫీడింగ్ చేస్తున్నారు. తల్లి పాలలోని ఔషధాలు, రోగ నిరోధక శక్తిని పెంపొందించే పోషకాలు, ప్రొటీన్లు పిల్లలకు ఏ ఆహారంలోనూ దొరకవు. పాలను దానం చేసే తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చి, మిగులు పాలను సేకరిస్తున్నాం. మిల్క్ బ్యాంక్‌కు పెద్దఎత్తున స్పందన లభిస్తోంది

– శైలజ, లక్ష్మి, స్టాఫ్ నర్సులు, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, తిరుపతి

మరో ప్రాణానికి ఆసరాగా




మిగులు పాలను డొనేట్ చేస్తే మరో పసిబిడ్డ ఆకలి తీర్చి ప్రాణాలకు ఆసరాగా ఉంటుందనే సంకల్పంతో నేను పాలను డొనేట్ చేస్తున్నాను. మాకు తల్లిపాల బ్యాంక్ సిబ్బంది డ్రైఫ్రూట్స్ అందిస్తున్నారు. ఇక్కడ నర్సులు, డాక్టర్లు ఎంతో సహకరిస్తున్నారు. పాలు మిగిలే ప్రతి తల్లి పాలను డొనేట్ చేసి నవజాత శిశువులకు అండగా ఉండాలని కోరుతున్నా.

– సుప్రజ, పాలను దానం చేసిన తల్లి, తిరుపతి

మీలో ఎవరు లక్షాధికారి?

- ఆర్బీఐ స్థాపించి 90 ఏళ్లయిన సందర్భంగా యూజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు
- ఆర్బీఐ లక్ష్యాలు, బ్యాంకింగ్ వ్యవస్థ, డిజిటల్ లావాదేవీలు వంటి వాటిని ప్రోత్సహించడమే ఉద్దేశం
- భారీస్థాయిలో నగదు ప్రోత్సాహకాలు
- ఈ నెల 19 నుంచి 21వ తేదీవరకు ఆన్‌లైన్‌లో పోటీలు
- రిజిస్ట్రేషన్‌కు 17వ తేదీ వరకు అవకాశం
- తిరుపతి జిల్లాలో సుమారు 25 వేల మంది విద్యార్థులు అర్హులు



రాష్ట్ర స్థాయిలో నగదు బహుమతులు...

ప్రథమ బహుమతి	ద్వితీయ బహుమతి	తృతీయ బహుమతి
రూ.2లక్షలు	రూ.1.50 లక్షలు	రూ.లక్ష

జోనల్ స్థాయిలో..

ప్రథమ బహుమతి	ద్వితీయ బహుమతి	తృతీయ బహుమతి
రూ.5 లక్షలు	రూ.4 లక్షలు	రూ.3 లక్షలు

జాతీయ స్థాయిలో..

ప్రథమ బహుమతి	ద్వితీయ బహుమతి	తృతీయ బహుమతి
రూ.10 లక్షలు	రూ.8 లక్షలు	రూ.6 లక్షలు

తిరుపతి సిటీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా యూజీ చదువుతున్న విద్యార్థులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. భారీఎత్తున నగదు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ 'ఆర్బీఐ–90' పేరుతో క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థులలో రిజర్వ్ బ్యాంక్‌పై అవగాహనతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థ, డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక సురక్షితం, నగదు బాధ్యతాయుత వినియోగం వంటి వాటిని ప్రోత్సహించే ప్రధాన ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తోంది. తిరుపతి జిల్లాలో అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ) సాధారణ డిగ్రీతో పాటు బీటెక్, ఎంబీబీఎస్ విద్యార్థులు సైతం ఈ క్విజ్‌లో పాల్గొనేందుకు అర్హులే. జిల్లాలో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఆర్బీఐ నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈనెల 17వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ పోటీలను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నారు.

ఏ అంశాలపై అవగాహన ఉండాలంటే..!

క్విజ్ పోటీలు ప్రధానంగా ఇంగ్లిషు, హిందీ భాషల్లో ఉంటాయి. ఇందులో ఆర్బీఐ ప్రారంభం నుంచి నేటి వరకు చేపట్టిన సంస్కరణలు, డిజిటల్ కరెన్సీ, దేశ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, క్రీడలు, చరిత్ర, సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ ఎఫైర్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి.

దరఖాస్తు చేసుకోవడం ఇలా....

ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో యూజీ (డిగ్రీ) చదువుతున్న ప్రతి విద్యార్థి అర్హులే. 2024 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 25 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన పనిలేదు. www.rbi90quiz.in వెబ్‌సైట్‌ను సంప్రదించి స్టూడెంట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. రిజిస్ట్రేషన్ పేజీలో విద్యార్థికి సంబంధించి పూర్తిస్థాయి సమాచారం అందించి సబ్‌మిట్ కొడితే ప్రక్రియ పూర్తవుతుంది.

నాలుగు దశల్లో క్విజ్ పోటీలు..

పోటీల్లో ప్రతి కళాశాల నుంచి ఎంతమంది అయినా విద్యార్థులు పాల్గొనవచ్చు. కానీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే పాల్గొనాలి. నాలుగు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పోటీలు తొలుత జిల్లాస్థాయిలో, ఆ తర్వాత రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో జరుగుతాయి. ప్రతిభ చూపిన విద్యార్థులు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు నగదు గెలుచుకునే అవకాశం ఉంటుంది.

ఎవరికి ఎంత బహుమతి అంటే..!

ఆర్బీఐ నిర్వహించే క్విజ్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్మార్ట్ ఫోన్, కంప్యూటర్‌ను అందించనున్నారు. అదేవిధంగా రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు లక్షల్లో నగదు బహుమతులను అందజేయనున్నారు.


ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయండి



సీఎండీని కలిసిన కేవీబీ అసోసియేషన్ నేతలు

తిరుపతి రూరల్: ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు సూచించారు. విద్యుత్ సంస్థలో క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ ఉద్యోగుల అసోసియేషన్ (కేవీబీ) నూతనంగా ప్రారంభమైంది. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును అసోసియేషన్ అధ్యక్షుడు అనంతప్రసాద్, కార్యదర్శి భాస్కర్‌రాజు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ ఏర్పాటు ఆవశ్యకత, విధి విధానాలను వివరించారు.

సాంఖ్యిక శాస్త్రంలో పట్టు సాధించాలి



కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్ రావు, వీసీ అప్పారావు, అధికారులు

తిరుపతి సిటీ: విద్యార్థులు సాంఖ్యిక శాస్త్రంలో పట్టు సాధించి ఉన్నతస్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు అన్నారు. ఎస్వీయూ సాంఖ్యిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాల్‌లో మంగళవారం అనాలసిస్ ఆఫ్ క్యాటగిరికల్ స్పేర్ డేటా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏటా జరిగే ఈ కార్యక్రమానికి పద్మ విభూషణ్ గ్రహీత ప్రొఫెసర్ సీఆర్ రావు హాజరై తన తల్లిదండ్రులు సీడీ నాయుడు, ఆర్కాట్ లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం రూ.2 లక్షలు విరాళం అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సాంఖ్యిక శాస్త్రం సబ్జెక్టులో పట్టు సాధించడం ద్వారా ఎన్నో ఉన్నతమైన అవకాశాలను అందుకోవచ్చన్నారు. ప్రొఫెసర్ సీఆర్ రావుతో వర్సిటీలోని సాంఖ్యిక శాస్త్ర విభాగానికి ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఆయన దేశంలోనే గొప్ప సాంఖ్యిక శాస్త్రవేత్త అని, ఆయన రూపొందించిన మోడల్స్ ఎంతో పేరు గాంచాయన్నారు. ఈ సందర్భంగా సీఆర్ రావును వర్సిటీ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తులసి రామకృష్ణారెడ్డి, సాంఖ్యిక శాస్త్ర విభాగాధిపతి సరోజమ్మ, డాక్టర్ వెంకటరమణారెడ్డి, బాల సిద్ధమని, జయసుబ్బారెడ్డి, సుధాకరయ్య, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒంటిపై పెట్రోల్ పోసుకుని..

నాయుడుపేటటౌన్ : ఒంటిపై పెట్రోల్ పోసుకుని భయోత్పాతం సృష్టించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక. పడమటివీధిలో ఉండే రామచంద్ర తన అన్న భార్యను వేధించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహించిన రామచంద్ర తన వదినను భయపెట్టేందుకు పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో ఉన్న వదినను దూషిస్తూ బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటిచుకునేందుకు యత్నించాడు. ఈలోపు పోలీసులు వచ్చి రామచంద్రను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ఎర్ర కూలీకి ఐదేళ్ల జైలు


శిక్ష పడిన నిందితుడు దొరస్వామి

తిరుపతి లీగల్ : అక్రమంగా ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తున్న కేసులో ఎర్రవారిపాలెం మండలం, కోట కాడపల్లి, వీఆర్ కాలనీకి చెందిన కల్వకుంట దొరస్వామికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6 లక్షలు భారీ జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు.

బంగారం విక్రయిస్తానంటూ..

శ్రీకాళహస్తి: బంగారం విక్రయిస్తానంటూ మోసం చేసిన హేమచంద్రారెడ్డి(35) అనే యువకున్ని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీకి చెందిన హేమచంద్రారెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో కొంత బంగారు ఆభరణాలను ఏడాది కిందట కుదువ పెట్టాడు. వాటిని విడిపించేందుకు తిరుపతికి చెందిన ప్రైవేటుసంస్థ నిర్వాహకులతో మాట్లాడాడు. రెండు నెలల కిందట వారి వద్ద రూ.2 లక్షలు నగదు తీసుకుని బంగారం విడిపించకుండానే పరారయ్యాడు. అలాగే మరో రెండు ప్రైవేటు సంస్థలతో బంగారం విక్రయిస్తానని నమ్మించి మళ్లి నగదు స్వాహా చేశాడు. దీనిపై బాధితులు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం హేమచంద్రారెడ్డిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

టెండరు ప్రకటన

Roc. No. TTD-28021(31)/26/2024-SVCO SEC-TTD తేది: 10-09-2024

01 (ఒక) సంవత్సర కాలానికి తిరుపతి, తిరుమల మరియు తిరుచానూరు వద్ద 7 (ఏడు) తితిదే క్యాంటీన్లకు తాజా కూరగాయలు సరఫరా చేయుటకు తిరుపతి మరియు చిత్తూరు జిల్లాల్లో నమోదిత రైతు సంఘాల నుండి సీల్డు టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంటు కొరకు వెబ్‌సైట్ www.tirumala.org ని లాగిన్ అవ్వండి మరియు తేదిది 11-09-2024 నుండి 26-09-2024న మ.12 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండరు దాఖలుకు చివరి తేది 26-09-2024న మ.3.00 గం.వరకు. ఇతర వివరాల కొరకు, సంప్రదించు ఫోన్ నం. 7338766673/ 9494652729.

TTD-40021(31)/1/2024-PRO SEC(Adv.No.139), Dt: 10-09-2024 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

ONE SITTING

ఒకే సం.లో B.Com, BCA, BBA, B.Sc, Diploma, B.Tech, ITI, Online, Regular, Distance, Aarya College, Tirupati, Cell: 93936 22612.

ONE SITTTING, 10th, 12th, BA, B.Com., B.Sc, M.A., M.Com., M.Sc., MBA, BBA, BCA, B.Tech, D.Ed, B.Ed, Agriculture, Pharmacy, Nursing (For Dropouts / Back Logs) From Recognised Universities, Exams in Sep/Oct. Cont : 73383 76874

Real Estate

PLOT FOR SALE

7 లక్షల 50 వేలకే తుడా అప్రూవ్డ్ వెంచర్‌లో 150 గజాల (37 1/2 అం.) ఇంటి స్థలం శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి దగ్గరలో, స్పాట్ రిజిస్ట్రేషన్ ఫ్రీ సైట్‌విజిట్.9849045595, 6309753339.

గూడూరు నుండి వెంకటగిరి రోడ్డు TNR గార్డెన్ తిప్పవరప్పాడు ఫాంల్యాండ్. 25ఎకరాల మామిడి తోట మెయిన్ రోడ్ అనుకొని అం॥ 26,000/-. అన్ని ప్లాట్లు 60 అంకణాలు.సెల్: 95734 75089.

BUSINESS SERVICE



BUSINESS OFFER

ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీలోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్ ఫోన్ : 7015882322

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

Wanted

Tirupati, Tata Nagar: Enroll to lern New Skills, Software Training & Placement. Courses we Provide: AI, SAP, SQL, ML, Data Science, IT Recruiter. 9000656025.

Wanted Primary Teacher to teach English. Contact: SM High School, Tirupati, Cell: 9866319268.

Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9030612463 (Work from Home available)

మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 58208

Wanted Male Marketing staff Age Limit :21 to 45, Qualification Any Degree, Salary Upto: 15,000/- Loca tion : Tirupati, Contact: 9248733375

కష్టపడేవారు కావాలిVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 9182260297.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ : 18K. Ph: 9640528899, 9640648899

రేణిగుంట ఫ్యాక్టరీలో పని చేయుటకు ASO / సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం నెలకు 15500/- 13500/- 8 గం. ఉచిత వసతి కలదు. ESI, PF, బోనస్ కలదు. 10th పాసై, ఎత్తు 5'.6" వయస్సు-20 నుండి 40 సం. లోపు. సెల్: 7993280289, 8919606707

E.Kart నందు Urgent గా స్త్రీ/పు॥ కావలెను. Inter, Any Degree, Salary: 14,500/- Online are available.Cell: 8555890812, 7036030841.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు [illegible] ఈ విషయాన్ని గమనించగలరు.



నేటితరం యువత ఎంచుకున్న రంగం ఏదైనా సరే పోటీ పడుతూ రాణిస్తున్నారు. సాధించాలనే తపన ఉన్నవారికి అవకాశాలు కూడా వెంటే వస్తున్నాయి. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన ఫ్యాషన్ సంస్కృతి నేడు చిన్నచిన్న పట్టణాలకు సైతం విస్తరిస్తోంది. ఫ్యాషన్ డిజైన్ అలంకరణలతోనే ఆగిపోకుండా ఉపాధి వైపు అడుగులు వేస్తోంది. చదువుకున్న యువత తమ నైపుణ్యాన్ని ఈ రంగంలో పెట్టుబడిగా పెట్టి స్వయం ఉపాధి పొందుతున్నారు. ఉద్యోగం రాలేదన్న నిరుత్సాహాన్ని దూరం చేసి వారి జీవితాలను రంగులమయం చేస్తోంది.


ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందుతున్న యువతులు



- నేటి యువతకు వరంగా మారిన ఫ్యాషన్ డిజైనింగ్
- స్వయం ఉపాధి కల్పిస్తున్న పలు రంగాలు
- అలంకరణలకే పరిమితం కాకుండా ఉపాధి చూపుతున్న ఫ్యాషన్ డిజైన్
- చిన్న పట్టణాలకూ విస్తరించిన కోర్సులు
- కలర్‌ఫుల్‌గా మారుతున్న జీవితాలు


శిక్షణ పొందుతున్న యువతులు

ఫ్యాషన్ లైఫ్

తిరుపతి గాంధీ రోడ్: ప్రస్తుతం ట్రెండ్ అంతా ఫ్యాషన్ డిజైనింగ్‌దే. నేటి యువత ఫ్యాషన్‌కు అలవాటు పడిపోవడంతో అదే కొందరికి ఉపాధిగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో పదో తరగతి అర్హత ఉంటే చాలు ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు అందుబాటులోకి ఉంటున్నాయి. ఏడాది కాల పరిమితి కలిగిన ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రధానంగా డ్రెస్ డిజైన్, జ్యువెలరీ డిజైన్, బ్యూటీ షన్, గృహాలంకరణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు సమాజంలో వృత్తిపరంగా రాణించేందుకు అదనంగా కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి అంశాలను నేర్పుతున్నారు. తక్కువ కాల పరిమితి గల డ్రెస్ డిజైన్, బ్యూటీషియన్, టైలరింగ్, జ్యువెలరీ డిజైన్ వంటి కోర్సులు నేర్చుకునే వెసులుబాటు ఉంది. ఈ కోర్సుల్లో రాణించడానికి ఎటువంటి విద్యార్హత ప్రామాణికం కాకపోయినా, కేవలం సృజనాత్మకతే పెట్టుబడిగా చేసుకుని జీవనోపాధి పొందే అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో ఫ్యాషన్ డిజైన్ కోర్సులు అందుబాటులో ఉండేవి. నేడు తిరుపతి నగరంలో సైతం ఈ కోర్సులు అందుబాటులో ఉండడంతో మహిళలు వీటిలో పట్టు సాధించేందుకు ఆసక్తి చూపుతున్నారు. శిక్షణ పూర్తి చేసి తద్వారా చక్కటి ఉపాధి పొందుతున్నారు.



బీఎస్సీ పూర్తి చేసినా..



నేను బీఎస్సీ పూర్తి చేశా. కానీ ఉద్యోగం రాలేదని నిరుత్సాహ పడకుండా ఫ్యాషన్ డిజైన్ కోర్సు చేశాను. ప్రస్తుతం ఇంటి వద్దే చక్కటి డిజైన్లతో చీరలు తయారు చేస్తున్నాను. తద్వారా ఆదాయం పొందుతున్నాను. ఈ కోర్సు నా జీవితానికి చక్కటి ఆదాయ మార్గంగా నిలిచింది.

– లతశ్రీ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

విదేశాలకు వెళ్దామని..



చదువు లేనివారికి సైతం చక్కటి ఉపాధి మార్గం చూపుతున్న కోర్సు ఫ్యాషన్ డిజైన్. సృజనాత్మకతకు నైపుణ్యం తోడైతే ఫ్యాషన్ డిజైన్ ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయమే. నేడు ఈ కోర్సులు నేర్చుకున్న వారికి పలు ప్రముఖ కంపెనీల్లో చక్కటి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. విదేశాలకు వెళ్దామని చదువుకున్నా.

– కళావతి, మదనపల్లి, అన్నమయ్య జిల్లా

బి ఫార్మసీ చదివా..



నేను బీఫార్మసీ చదువుకున్నాను. ఫ్యాషన్ డిజైన్ శిక్షణలో సృజనాత్మకత తోడైతే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందడంతో పాటు కుటుంబానికి ఆదరణ కల్పించవచ్చు. చిన్ననాటి నుంచి ఫ్యాషన్ డిజైన్‌పై మక్కువతో కోర్సు చేశాను. ప్రస్తుతం నెలకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి నావంతు సహకారం అందించడం సంతోషకరం.

– మమత, కుప్పం, చిత్తూరు జిల్లా

నమ్మకాన్ని పెంచింది..



ఫ్యాషన్ డిజైన్ కోర్సు ద్వారా సొంత కాళ్లపై బతకగలనన్న నమ్మకం పెరిగింది. డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్ చదివినా ఉద్యోగం లేదు. ఫ్యాషన్ డిజైన్‌పై మక్కువతో ఏడాది ఫ్యాషన్ డిజైన్ డిప్లొమా కోర్సు చేశాను. అందమైన డిజైన్లతో నేను తయారు చేసే శారీస్, బ్లౌజులకు మంచి స్పందన లభిస్తోంది. సినీతారలకు డ్రెస్ డిజైన్ చేసే అవకాశం లభించింది.

– అమల, నరసరావుపేట

గొడవకు కారణమైన వారిపై కఠిన చర్యలు

– ఏఎస్పీ రవిమనోహరాచారి


ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌ను విచారిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

కేవీబీపురం(వరదయ్యపాళెం): రెండు గ్రామాల మధ్య వివాదాలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. వినాయకచవితి వేడుకల్లో భాగంగా రాగిగుంట గ్రామం వద్ద ఇద్దరి యువకుల అత్యుత్సాహం కారణంగా రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తలకు కారణమైన విషయం తెలిసిందే. ఈ కేసులో రెండు గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పెరిందేశం, రాగిగుంట గ్రామాలకు చెందిన 40 మందిపై 7 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, వారిలో 24 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సుపై దాడి ఘటనలో..

రెండు గ్రామాల వద్ద నెలకొన్న వివాదంలో పెరిందేశం దళితవాడకు చెందిన కొందరు ప్రధాన రహదారిపై వెళ్తున్న బస్సుపై రాళ్లతో దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. ఈ ఘటనపై మంగళవారం సంబంధిత బస్సులో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ను కేవీబీపురం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. వారి నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

వీఆర్‌కు ఏఎస్ఐ లోకనాథం..

ఈ ఘటనలో ఓ వర్గానికే మద్దతు పలికి రెండు గ్రామాల మధ్య వివాదానికి కారకులయ్యారని ఏఎస్ఐ లోకనాథంపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా అధికారులు ఏఎస్ఐ లోకనాథంను వీఆర్‌కు పంపడం జరిగింది.

అనుమానం పెనుభూతమై..

- క్షణికావేశంలో భార్యను కత్తితో నరికి చంపిన భర్త
- అనాథలైన బిడ్డలు
- సైదాపురం మండలం గంగదేవిపల్లిలో ఘటన


నిందితుడితో ఇంట్లోకి ప్రవేశిస్తున్న సీఐ


మెడపై కత్తితో నరకడంతో చనిపోయిన లావణ్య


లావణ్య (ఫైల్)

సైదాపురం: క్షణికావేశంలో తాళికట్టిన భార్యపై అనుమానంతో కత్తితో దారుణంగా నరికి చంపేశాడు ఓ భర్త. అనంతరం బిడ్డలతో కలిసి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన ఘటన సైదాపురం మండలంలో చోటు చేసుకుంది. రాపూరు సీఐ విజయకృష్ణ అందించిన వివరాల మేరకు.. మండలంలోని గంగదేవిపల్లికి చెందిన చింతలపూడి మహేంద్ర(33)కు అదే గ్రామానికి చెందిన లావణ్యకు 11 ఏళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి వరుణ్(10), జయవర్ధన్(8) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్ల కిందట నెల్లూరుకు కాపురం మార్చారు. అయితే వీరి మధ్య ఏడాది నుంచి వివాదం జరుగుతుండేది. ఈ క్రమంలో ఇటీవలే స్వగ్రామానికి వెళ్లారు. మహేంద్రకు తన భార్యకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం భార్యభర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. దుస్తులు సర్దుకుని తన అమ్మవారి పుట్టినిల్లు అయిన చిట్వేల్‌కు చేరుకునేందుకు లావణ్య సిద్ధమైంది. ఇరుగు పొరుగు వారు సర్దిచెప్పారు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మళ్లీ ఇంటి నుంచి వెళ్లేందుకు లావణ్య ప్రయత్నించడంతో మహేంద్ర క్షణికావేశంలో అక్కడే ఉన్న కత్తి తీసుకుని తలపై కొట్టి గొంతు కోశాడు. దీంతో లావణ్య చనిపోవడంతో ఇద్దరు బిడ్డలను తీసుకుని మహేంద్ర సైదాపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన భార్యను చంపేసినట్లు లొంగిపోయాడు. ఎస్ఐ క్రాంతికుమార్, సీఐ విజయకృష్ణ ఘటనా స్థలికి చేరుకుని హత్యకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు. కేసును నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వారి రోదన చూసి స్థానికులు చలించిపోయారు.

పోలేరమ్మ జాతర నిర్వహణపై సమీక్ష

తిరుపతి అర్బన్: భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో దర్శనం చేయించినప్పుడే ఉత్సవాలు విజయవంతమైనట్లు భావించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎస్పీ సుబ్బరాయుడు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలసి కలెక్టర్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటగిరి పోలేరమ్మ జాతర రాష్ట్రపండుగ నేపథ్యంలో వైభవోపేతంగా జరపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 26 వరకు జరగనున్న పోలేరమ్మ ఉత్సవాలను అన్ని విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాజేంద్ర, రవిమనోహర ఆచారి, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, టెంపుల్ ఈఓ శ్రీనివాసులు రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సకల సదుపాయాల కల్పనే లక్ష్యం

- 40 స్కూళ్లను ఆదర్శంగా తీర్చిదిద్దండి
- విద్యాశాఖ అధికారుల సమావేశంలో కలెక్టర్


హాజరైన హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారులు

తిరుపతి అర్బన్: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా స్కీమ్ ద్వారా ఎంపికైన పాఠశాలల్లో సకల సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎం స్కూల్ ఫర్ రైజింజ్ ఇండియా స్కీమ్‌పై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలి దశలో 23, రెండో దశలో 17 స్కూళ్లను ఎంపిక చేశారని చెప్పారు. మొత్తం 40 పాఠశాలల అభివృద్ధికి కేంద్రం నుంచి 66 శాతం, రాష్ట్రం నుంచి 34 శాతం నిధులు కేటాయింపులు ఉంటాయని చెప్పారు. ప్రధానంగా పాఠశాలల బలోపేతం చేయడంతో పాటు, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం 2022–23 సంవత్సరం నుంచి 2026–27 వరకు ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టు అమలులో ఉంటుందన్నారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ మొదటి దశలోని 23 స్కూళ్లకు సంబంధించి 9 సెకండరీ విద్యాలయాలు, 14 సీనియర్ సెకండరీ విద్యాలయాల్లో పది కెమిస్ట్రీ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒక్కో ల్యాబ్‌కు రూ.15.58 లక్షల నిధులు కేటాయించారని, మరోవైపు 21 స్కూళ్లకు క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి చేయాలని, ఇందులో ఒక్కో స్కూల్లో రూ.5 లక్షల నిధులతో పనులు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి, నోడల్ అధికారి శివశంకర్, డిప్యూటీ విద్యాధికారులు శాంతి, ప్రభాకర్ రెడ్డి, బాలాజీ, ఎస్ఎస్ఎ సెక్టోరల్ అధికారులు, పలువురు ఈఈ పాల్గొన్నారు.

పంపకాల్లో తేడాలు వచ్చి..

- ఒకరి హత్య
- ఆపై మిగతా ముగ్గురు మిస్సింగ్


శవాన్ని పూడ్చి పెట్టిన చోటుగా భావిస్తున్న ప్రాంతం

చిల్లకూరు : పొలం వద్ద కాపాలా ఉండే ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదంలో ఒకరి హత్యగురైన సంఘటన వెలుగు చూసింది. అయితే తోటకు కాపాలాగా ఉన్న వ్యక్తులు కనిపించడం లేదని తోట యజమాని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని తొణుకుమాల సమీపంలో ఉన్న ఓ తోట వద్ద కొంతకాలంగా అంకయ్య అతని భార్యతో కలసి కాపలాగా ఉంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వెంకటగిరి ప్రాంతానికి చెందిన బంధువులైన మరో జంట వెంకటేశ్వర్లు తన భార్యను తీసుకుని వచ్చి తోడుగా పెట్టుకున్నారు. అయితే అంకయ్య, వెంకటేశ్వర్లు రైతుల పొలాల్లో చిన్నపాటి దొంగతనాలు చేస్తుంటారు. అయితే చోరీ చేసిన వస్తువులను పంచుకోవడంలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి వారు గొడవ పడ్డారు. అందులో అంకయ్య కట్టెతో కొట్టడంతో వెంకటేశ్వర్లు (40) చనిపోయినట్లు సమాచారం. అనంతరం అంకయ్య దంపతులు, వెంకటేశ్వర్లు భార్యతో కలిసి శవాన్ని పూడ్చి పెట్టినట్లు సమాచారం. ఆ తరువాత అంకయ్యతో పాటు వెంకటేశ్వర్లు భార్య కూడా కనిపిచకుండా పోవడంతో తోట యజమాని అరుణ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడ శవాన్ని పూడ్చిన ఆనవాళ్లు అయితే ఉన్నాయని, మండల మెజిస్ట్రేట్ లేకపోవడంతో వెలికి తీయలేకపోతున్నామని తెలిపారు. అయితే ఇదే సమయంలో అంకయ్య దంపతులు, వెంకటేశ్వర్లు భార్య కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్ చంద్రకుమారి, విద్యార్థి శేషిరెడ్డిని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు సురేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈఓ శేఖర్, ఉపాధ్యాయ సంఘం నేతలు

తిరుపతి అర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ జిల్లాకు ఆణిముత్యమేనని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆగస్టు 15న ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న కూనాటి సురేష్‌ను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌తో పాటు డీఈఓ శేఖర్, పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు ఉప జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆహ్వానితులకు కలెక్టర్ సన్మానం...

ఆగస్టు 15న ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టరేట్‌లో కలెక్టర్, డీఈఓ ఘనంగా సన్మానించారు. ఇందులో సంతవేలూరు ఉపాధ్యాయురాలు ఎన్వీ లత, వరదయ్యపాళెం విద్యార్థిని రుూన్సీ, బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన కిషోర్‌నాయక్, తొండమనాడు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు చంద్రకుమారి, విద్యార్థి జీవీ శేషిరెడ్డి ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం


మునిరాజా(ఫైల్)

వాకాడు: గణేష్ విగ్రహ నిమజ్జనంలో భాగంగా సోమవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో గల్లంతైన యువకుడు మంగళవారం శవమై కోట మండలం సముద్ర తీరానికి కొట్టుకొచ్చాడు. నాయుడుపేటకు చెందిన మునిరాజా(22) తన స్నేహితులతో కలసి తూపిలిపాళెం సముద్రతీరంలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నాడు. ప్రమాదవశాత్తు సముద్రంలో స్నానం చేస్తున్న మునిరాజా అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోయాడు. అతని ఆచూకీ కోసం 24 గంటల పాటు 17 కిలోమీటర్ల దూరం వరకు సముద్ర తీరాన వాకాడు పోలీసులు, స్థానిక మత్స్యకారులు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కోట మండలం శ్రీనివాససత్రం గ్రామ సముద్ర తీరానికి మంగళవారం శవమై కొట్టుకురావడంతో పోలీసులు గుర్తించి మృతదేహానికి బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వాకాడు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

వినాయకుడి నిమజ్జనంలో అసభ్య నృత్యాలు

- తిరుపతిలో ఏడుగురిపై కేసు
- భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం : ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా సోమవారం ఓ ప్రాంతంలో అసభ్య నృత్యాలు ప్రదర్శించారు. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం.. ఆపై విమర్శలు వెల్లువెత్తడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్ అయ్యారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేస్తూ సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. వివరాలకు వెళ్తే.. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా నగరంలోని సప్తగిరి నగర్‌లో నిర్వాహకులు వినాయక విగ్రహం ముందు మహిళలతో కలిసి ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా అసభ్య నృత్యాలు ప్రదర్శించారు. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో, అలిపిరి సీఐ రామ్‌కిషోర్ ఇందుకు కారణమైన ఏడుగురు నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఎం.వినోద్ కుమార్, జి.కిరణ్ కుమార్, జశ్వంత్ రెడ్డి, పి.వినయ్, హేమంత్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరంలో ఇలాంటి వాటికి తావులేదని, వీరు పోలీసుల వద్ద కూడా అనుమతులు తీసుకోలేదని తెలిపారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో మళ్లీ పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతామన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి, శాంతినగర్‌కు చెందిన పి.నరేంద్ర నాయుడు, పి.రేవతికి 8 నెలలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి, సత్యనారాయణపురం, భాను రెసిడెన్సీకి చెందిన ఉషారాణి కోర్టులో వారిద్దరిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.